శానిటరీ వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలి

పెనుగొండ: గత 5 సంవత్సరాలుగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలలలో ఆయాలుగా పనిచేస్తున్న శానిటరీ వర్కర్స్‌కు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, నెలనెలా వేతనాలు చెల్లించాలని సిఐటియు డిమాండ్ చేసింది. శనివారం పెనుగొండ గ్రామపంచాయతీ పార్కు వద్ద జరిగిన శానిటరీ వర్కర్స్ సమావేశంలో జిల్లా సిఐటియు ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు చేయాలని, రోజుకు నాలుగు సార్లు టాయిలెట్స్ శుభ్రం చేస్తున్నారు కానీ ప్రభుత్వ విధానాల కారణంగా ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఉన్నత పాఠశాలలో 300 మంది విద్యార్థులకు ఇద్దరు ఆయాలు పనిచేస్తున్నారని, 300 మంది విద్యార్థులో ఒక విద్యార్థి తక్కువై 299 ఉంటే రెండవ ఆయాను దేవ, వడలి పాఠశాలల్లో తొలగించారని విమర్శించారు. 50 నుంచి 200 వరకు విద్యార్థులు ఉంటే ముగ్గురిని పనిలో ఉంచాలని డిమాండ్ చేశారు. వ్యకాస జిల్లా కమిటీ సభ్యులు షేక్ పాదుషా, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

బరులు రెడీ'..!

పోలీసుల ఉత్తుత్తి చర్యలపై
అంతా పెదవి విరుపు
కోడిపందేలకు పందేలరాయుళ్లు
సర్వం సన్నద్ధం
ఊరూవాడా.. ముమ్మరంగా
బరుల ఏర్పాటు
బరులు ప్రాతిపదికన పోలీసులకు
మామూళ్లు అంటూ ప్రచారం
గతానికి భిన్నంగా ఈ సారి నెల రోజుల
నుంచే పందేల జోరు
భోగి రోజు నుంచి మరింత
పెరిగే అవకాశం
కోర్టు ఆదేశాలు ఈ ఏడాది బేఖాతర్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

హైకోర్టు ఆదేశాలను తుంగలోతొక్కి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ముమ్మరంగా కోడిపందేల బరుల ఏర్పాటు జరుగుతోంది. గతేడాది కంటే ఈసారి పెద్దఎత్తున పందేలు నిర్వహించేందుకు పందెం రాయుళ్ల సర్వం సన్నద్ధం చేసుకున్నారు. ఏటా మాదిరిగా పోలీసుల ఉత్తుత్తి చర్యలపై జనాలు నవ్వుకుంటున్న పరిస్థితి నెలకొంది. గతం కంటే భిన్నంగా ఈ ఏడాది గడిచిన నెల రోజులు కోడిపందేల జోరు కొనసాగుతోంది. ఇక పండుగ మూడు రోజులు అనధికార ఆదేశాలతో విచ్చలవిడిగా పందేల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 13వ తేదీ భోగి రోజు పందేల జోరు ప్రారంభం కానుంది. రెండు జిల్లాల్లో దాదాపు 400లకు పైగా కోడిపందేల బరులు ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. పందేలరాయుళ్ల అందుకు సంబంధించి ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ముదినేపల్లి, కొయ్యలగూడెం, పెదవేగి, కాళ్ల, ఆకివీడు వంటి అనేక మండలాల్లో శనివారమే కోడిపందేల బరులు సిద్ధమైన పరిస్థితి నెలకొంది. బరులను ట్రాక్టర్లతో చదును చేసి టెంట్ల ఏర్పాటుకు ముమ్మరంగా పనులు సాగిస్తున్నారు. ఏటా మాదిరిగానే పోలీసులు ఈ సారి కూడా బరులు ధ్వంసం చేస్తున్నట్లు హడావుడీ చేయడం ప్రారంభించారు. బైండోవర్ కేసులు, బరులను ధ్వంసం చేస్తున్నట్లు ఫొటోలు వంటివి తీసుకుని కోర్టు నుంచి తప్పించుకునేందుకు పోలీసులు తమ ఎత్తుగడలతో ముందుకు సాగుతున్నారు. కోడిపందేలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే నాయకులంతా కూటమి ప్రభుత్వంలో ఉన్నత పదవుల్లో ఉన్నారు. దీంతో పోలీసులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఉండి నియోజకవర్గంలో గడిచిన నెలరోజులుగా కోడిపందేల జోరు కొనసాగుతున్నా పోలీసులు పట్టించుకున్న పాపానపోలేదు. దెందులూరు నియోజవర్గంలోనూ అదే పరిస్థితి నెలకొంది. పండుగ మూడు రోజుల్లో ప్రతి మండలంలోనూ కనీసంగా తక్కువగా లెక్కించిన చిన్నా, పెద్దా పది వరకూ కోడిపందేల బరులు కొనసాగనున్నట్లు తెలుస్తోంది. రాత్రిపూట సైతం నిర్విరామంగా కొనసాగేందుకు ఫ్లడ్‌లైట్లు సైతం ఏర్పాటు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి పందేలరాయుళ్ల జిల్లాకు క్యూ కడుతున్న పరిస్థితి నెలకొంది.

కొయ్యలగూడెం రాజవరం గ్రామంలో సిద్ధమవుతున్న కోడిపందేల బరి

నామకహగా కమిటీల ఏర్పాటు..

కోడిపందేలను అడ్డుకునేందుకు కోర్టు ఆదేశాలతో ఏటా మండలాల వారీగా కమిటీల ఏర్పాటు జరుగుతోంది. ఈ ఏడాది సైతం ఏలూరు జిల్లాలో 28 కమిటీలు ఏర్పాటు చేసినట్లు అధికారులు ఇటీవలే ప్రకటించారు. పశ్చిమలోనూ అదే పరిస్థితి. ఈ కమిటీలో మండలంలోని తహశీల్దార్, ఎస్ఐ, ఎన్‌జిఒ ప్రతినిధులు, కానిస్టేబుళ్ళ, ఇద్దరు వీడియో గ్రాఫర్లు ఉంటారు. మండలంలో ఎక్కడ కోడిపందేలు జరిగినా ఈ కమిటీలు ముందుగా గుర్తించి పోలీసులతో అడ్డుకోవాలి. ఏటా కమిటీలు ఏర్పాటు చేస్తున్నా కోడిపందేలు మాత్రం ఆగడం లేదు. నామకహగా ఏర్పాటు చేస్తున్న కమిటీలు ఎందుకన్న ప్రశ్నకు ఏ ఒక్కరి నుంచీ సమాధానం లేకుండా పోతోంది.

హైకోర్టు ఆదేశాలు బేఖాతర్

కోడిపందేలను అడ్డుకోవాలంటూ హైకోర్టు ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. ఈ నెల ఏడో తేదీన మరోసారి కోడిపందేలను అడ్డుకోవాలంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పందేలను అడ్డుకునే పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. రెండు జిల్లాల్లో కోడిపందేల బరుల ఏర్పాట్లు యథేచ్ఛగా సాగుతున్నాయి. కోర్టు ధిక్కరణ చర్యలను తప్పించుకునేందుకు అధికారులు ఉత్తుత్తి చర్యలు చేపడుతూ అందరినీ ఏమారుస్తున్న పరిస్థితి నెలకొంది. చట్టాలను తుంగలో తొక్కుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులపై కఠిన చర్యలు తీసుకున్నప్పుడే కోడిపందాలకు అడ్డుకట్ట పడుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కాళ్ల మండలం పెదఅమిరంలో ఏర్పాటు చేసిన బరి

బరుల ప్రాతిపదికన మామూళ్ల

కోడిపందేలకు ఎటువంటి ఇబ్బందీ ఉండదని తెలిపోవడంతో పోలీసులు, ఇతరులకు బరులు ప్రాతిపదికన మామూళ్ల ఇచ్చేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. చిన్న బరులకైతే రూ.50 వేలు, మోస్తారు, పెద్ద బరులకైతే రూ.లక్ష, బాగా పెద్దబరులకు రూ.నాలుగు లక్షల వరకూ మామూళ్ల ఇచ్చే విధంగా నిర్ణయిం జరిగినట్లు సమాచారం. పోలీసుల్లో కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకూ ఈ మామూళ్ల పర్వం కొనసాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బరుల వద్ద గుండాట, మూడు ముక్కలాట, అనధికార మద్యం అమ్మకాలకు సైతం పండుగ మూడు రోజులు కొనసాగించేందుకు అవకాశం ఇస్తున్నట్లు చెబుతున్నారు. బరుల వద్ద జాతరను తలపించే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కోడిపందేలు, జూదం పేరుతో వసూలు చేస్తున్న డబ్బులతో గ్రామాల్లో పనులు చేస్తామంటూ కొంతమంది ప్రజాప్రతినిధులు చెబుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం జూద క్రీడలను ప్రోత్సహిస్తోందా అన్న చర్చ జనాల్లో సాగుతోంది.

కేంద్ర పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులకు స్వాగతం పలుకుతున్న మంత్రి నిమ్మల

2027 సెప్టెంబరుకు పోలవరం పూర్తి

జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, పోలవరం

2027 సెప్టెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తామని రాష్ట్ర భారీ జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన కేంద్ర పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులతో మమేకమై ప్రాజెక్టు పనుల పురోభివృద్ధి సంబంధిత వివరాలు తెలిపిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ నిర్వాకం పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని 20 ఏళ్లపాటు వెనక్కి తీసుకుపోయిందన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వ పాలనలో ప్రాజెక్టు నిర్మాణంలో పనులు 72 శాతం పూర్తి చేసిందన్నారు. 18 నెలలపాటు కష్టపడి డయాఫ్రంవాల్ నిర్మిస్తే వైసిపి ప్రభుత్వ అలసత్వం, నిర్లక్ష్యం వల్ల డయాఫ్రంవాల్ ధ్వంసమైందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ఐదేళ్ల పాలనలో ధ్వంసం చేసిన వైసిపికి పోలవరంపై మాట్లాడే అర్హత లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన గడువు ప్రకారం డయాఫ్రంవాల్ కాంక్రీట్ పనులు చేపడతామన్నారు. 2017 సంవత్సరంలో నిర్వాసితులకు అప్పుడు అధికారంలో ఉన్న చంద్రబాబు రూ.800 కోట్లు పరిహారం అందించారని, మళ్లీ అధికారంలోకి వచ్చిన తక్కువ వ్యవధిలోనే మరో రూ.800 కోట్లకు పైగా నిధులు అందించింది చంద్రబాబేనన్నారు. గత వైసిపి పాలనలో నిర్వాసితులకు ఒక్క రూపాయి పరిహారం ఇవ్వలేకపోయారని, నిర్వాసితుల కాలనీల నిర్మాణం, బిల్లుల చెల్లింపులు జరగలేదన్నారు.

సత్యదేవుని దర్శనానికి వెళ్తుండగా..

కాకినాడ జిల్లా కత్తిపూడి వద్ద రోడ్డు ప్రమాదంలో ముగ్గురు భీమవరం వాసులు మృతి
సంక్రాంతి వేళ విషాదఛాయలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సత్యదేవుని దర్శనానికి భీమవరం నుంచి అన్నవరం కారులో వెళ్తుండగా కాకినాడ జిల్లా కత్తిపూడి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగిఉన్న లారీని కారు ఢీకొట్టడంతో భీమవరానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. భీమవరం గన్నాబత్తుల వారివీధికి చెందిన చవ్వాకుల శ్యాంప్రసాద్ (48), భార్య ప్రసన్న, తల్లి అమ్మాజీతోపాటు కృష్ణా జిల్లా కృత్తివెన్ని గ్రామానికి చెందిన శ్యాంప్రసాద్ బావమరిది శివన్నారాయణ (40), భార్య దివ్య (38) గత కొంతకాలంగా భీమవరంలో ఉంటున్నారు. అయితే వీరంతా కిరాయికి కారు మాట్లాడుకుని డ్రైవర్ ధనుష్‌ను తీసుకుని అన్నవరం బయలుదేరారు. ఈ క్రమంలో కాకినాడ జిల్లా కత్తిపూడి సమీపంలో హైవేలో ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టడంతో శ్యాంప్రసాద్, శివన్నారాయణ, దివ్య అక్కడికక్కడే మృతి చెందారు. గాయాలపాలైన మరో ముగ్గురిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఒకే కుటుంబ సభ్యులు మృతి చెందడంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

ఛార్జీల బాదుడు..!

సంక్రాంతి పేరుతో రెట్టింపు మొత్తంలో వసూలు

ప్రజాశక్తి - పాలకొల్లు

సంక్రాంతి కోసం సొంత గ్రామాలకు పట్టణాల నుంచి తరలివస్తున్నారు. ఇదే అదునుగా బస్, రైల్వే ఛార్జీలు విమాన ధరలతో పోటీ పడుతున్నాయి. శని, ఆదివారాలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు సెలవులు కావడం సోమ, మంగళ, బుధవారం వరుసగా సంక్రాంతి పండుగ కావడంతో బస్, రైల్వే టిక్కెట్ల ధరలకు రెక్కలొచ్చాయి. పాలకొల్లు, భీమవరం, నరసాపురం పట్టణాలకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్ నుంచి ఎక్కువగా వస్తారు. దీన్ని అదునుగా చేసుకుని ట్రావెల్స్ వారు టిక్కెట్ ధరలను అసాధారణంగా పెంచేశారు. సాధారణంగా టిక్కెట్ ధర వెయ్యిలోపు ఉండేవి. అయితే ఇప్పుడు రూ.3 నుంచి రూ.5 వేల వరకూ ఉండడంతో ప్రయాణికులు బెంబేలెత్తి పోతున్నారు. ఈ ధరలు చూస్తుంటే విమాన ధరలతో పోటీ పడుతున్నాయని పలువురు చెబుతున్నారు. తిరిగి వెళ్లేందుకు కూడా ఇదే పరిస్థితి ఉందని పలువురు వాపోతున్నారు. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు పాలకొల్లు వచ్చేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రయివేటు ట్రావెల్స్ వారు బస్ ఛార్జీలను దారుణంగా పెంచడంతో ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటికి తోడు రైల్వే టికెట్లు రెండు నెలల ముందు బుక్ కావడంతో తత్కాల్ టికెట్లు దొరకని పరిస్థితి ఉంది. దీంతో ప్రీమియం తత్కాల్ ధరలు విమాన ధరలతో పోటీపడుతోంది. ఇక ప్రయివేట్ వాహనాల్లో వచ్చేవారు గంటల కొద్దీ ట్రాఫిక్‌లో ఇరుక్కోవాల్సి వస్తోందని గగ్గోలు పెడుతున్నారు. ఇతర గ్రామాలకు కోనసీమ జిల్లాకు వెళ్లేందుకు పాలకొల్లు నుంచి వెళ్లాల్సి ఉండడంతో పాలకొల్లు పట్టణంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. దీనికి తోడు ఎమ్మెల్యే కప్ వాలీబాల్ టోర్నమెంట్స్ శనివారం నుండి ప్రారంభం కావడంతో పిపి రోడ్డుపై ట్రాఫిక్ పెరిగింది.

పాలకొల్లులో సంక్రాంతి సందర్భంగా నిలిచిన ట్రాఫిక్

కులగణన అభ్యంతరాలపై గడువు పెంచాలి

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతి బాబు

ప్రజాశక్తి - భీమవరం

కులగణన అభ్యంతరాలపై తేదీని పొడిగించాలని, దళిత పేటల్లో అవగాహన కల్పించేలా ప్రచారం చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. శనివారం కెవిపిఎస్ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన కులగణనను ప్రస్తుత ప్రభుత్వం ప్రకటిస్తోందని తెలిపారు. అన్ని గ్రామ సచివాలయాల్లో ప్రదర్శనకు పెట్టమని ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేయగా జిల్లాలో ఉన్న ఎక్కువ సచివాలయాల్లో వెంటనే పెట్టలేదని తెలిపారు. దీనిపై జిల్లా వ్యాప్తంగా కెవిపిఎస్ సర్వే చేయగా జిల్లాలో ఎక్కువ సచివాలయాల్లో కులగణన వివరాలపై కనీస అవగాహన దళితులకు లేదన్నారు. ఎటువంటి ప్రచారం చేయకుండా కులగణనను నిర్ధారించడం సబబు కాదన్నారు. అభ్యంతరాలు, సవరణలు చేయాలని సచివాలయం వద్దకు వెళ్తే సిబ్బంది సమాధానం కనీస అవగాహన లేనట్లు ఉందన్నారు. కనీస అవగాహన లేని వారికి కుల గణన బాధ్యతలు అప్పగించడం అన్యాయమన్నారు. అభ్యంతరాలు మార్చమని చెప్పినా సరైన సమాధానం చెప్పకుండా మొండిగా వ్యవహరిస్తున్న సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గునుపూడి చందు, బత్తుల అజయ్, ఇంజేటి క్రాంతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు

బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

తణుకు : తణుకు పట్టణంలోని పలు స్వచ్ఛంద, సేవా, సామాజిక సంస్థలు, విద్యాసంస్థల సహకారంతో తణుకు బాలోత్సవాలు జనవరి 24, 25 తేదీల్లో నిర్వహిస్తున్నామని, 26వ తేదీ బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందని తణుకు బాలోత్సవం అధ్యక్షులు పిఎల్.నరసింహారావు తెలియజేశారు. శనివారం స్థానిక కార్యాలయం వద్ద బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి పి.దక్షిణామూర్తి మాట్లాడుతూ వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, చిత్రలేఖనం, పోస్టర్ ప్రజెంటేషన్ వంటి 14 రకాల అకడమిక్ అంశాల్లోనూ దేశభక్తి-అభ్యుదయ గీతాలపన, నృత్యప్రదర్శ, నాటికలు, ఏక పాత్రాభినయం వంటి 9 రకాల కల్చరల్ అంశాల్లోనూ ఈ ప్రతిభా ప్రదర్శన, పిల్లల సంబరాలను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. విద్యావేత్తలు తమ సహకారం అందించి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ జె.చంద్రప్రసాద్, గోపాల్‌రెడ్డి, వై.రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

కోడిపందేలు మాని క్రీడలను ప్రోత్సహించాలి : కలెక్టర్

పాలకొల్లు : పాలకొల్లులో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3 రోజుల పాటు జరిగే సౌత్ జోన్ వాలీబాల్ పోటీలు, కలిదిండి రామరాజు స్మారక ఎంఎల్‌ఎ కప్ పోటీలను శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించారు. సంక్రాంతి అంటే కోడిపందేలు, జూదంకాదని వీటికి వ్యతిరేకంగా మంత్రి నిమ్మల రామానాయుడు 11 సంవత్సరాలుగా వాలీబాల్ పోటీలు నిర్వహించడం హర్షణీయమని జిల్లా కలెక్టర్ చెప్పారు. సంక్రాంతి సాంప్రదాయాలను ప్రజలు కాపాడాలని, ముఖ్యంగా యువత సంక్రాంతి సంబరాల్లో పాల్గొని కుటుంబ సాంప్రదాయాన్ని మెరుగుపర్చాలని కోరారు. అనంతరం ఎస్‌పి మాట్లాడారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు పాల్గొన్నారు.

అధిక ఛార్జీలు వసూలు చేయొద్దు

తాడేపల్లిగూడెం : సంక్రాంతి పండుగకు సొంత ఊర్లకు బయలుదేరుతున్న ప్రయాణికుల నుంచి టిక్కెట్ల ధరల కంటే అధిక ధరలు వసూలు చేస్తే బస్సులను సీజ్ చేస్తామని తాడేపల్లిగూడెం మోటార్ వెహికల్ అధికారి డి.సురేంద్ర సింగ్ నాయక్ తెలిపారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని పశ్చిమగోదావరి జిల్లా రవాణా శాఖ అధికారి ఉమమహేశ్వరరావు ఆదేశాల మేరకు ట్రావెల్స్ బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బస్సులలో సరైన రికార్డులు లేకుండా, టాక్సలు చెల్లించకుండా తిరుగుతున్న 54 ప్రయివేటు ట్రావెల్స్ బస్సులపై కేసులు రాసి, రెండు బస్సులు సీజ్ చేశామన్నారు. ఈ ప్రత్యేక తనిఖీల ద్వారా ఐదు లక్షల పంతొమ్మిది వేల రూపాయిలను ఫైన్ వేశామని, నాలుగు లక్షల ముప్పయి వేల రూపాయిలు టాక్స్, మొత్తం తొమ్మిది లక్షల నలభై రూపాయిలని ఆయన తెలిపారు. అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు.

ఐడెంటీ కార్డుల పేరుతో అక్రమ దందా అరికట్టాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

ప్రజాశక్తి - భీమవరం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో ఇప్పటి వరకు జాబ్ కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులు ఎంతమంది ఉన్నా పని చూపించే వారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ తెలిపారు. భీమవరం కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో జిల్లా కలెక్టర్‌కి విశాఖపట్నంకి చెందిన అక్షయ కమ్యూనికేషన్ ఏజెన్సీ దరఖాస్తు చేయగా కలెక్టర్ అనుమతితో డ్వామా పీడీ క్రింది స్థాయి సిబ్బంది అధికారులకి సర్క్యులర్‌ను నామ మాత్రపు రూ.60 చొప్పున వసూలు చేసి, ఐడెంటి కార్డులు ఇవ్వమని జారీ చేశారన్నారు. జిల్లాలో 1,78,363 జాబ్ కార్డులు ఉండగా 29,40,28 మంది కూలీలు ఉన్నారన్నారు. ఒక్కొక్క మనిషికి రూ.60 చొప్పున రూ.1,76,41,680 సొమ్మును ఒక ప్రయివేటు ఏజెన్సీకి కట్టబెట్టడం సరైంది కాదన్నారు. మరోపక్క జాబ్ కార్డు నెంబర్ ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్, బ్యాంక్ అకౌంటు అన్ని అనుసంధానం చేసి ఆ కార్డుపైన ఉంటాయని చెప్పడం అనేక అనుమానాలకు దారితీస్తుందన్నారు. గత ప్రభుత్వం ప్రయివేట్ ఏజెన్సీలకు ఆధార్ కార్డు అనుసంధానం చేస్తే వ్యక్తిగత సమాచారం అంతా కూడా వాళ్ల దగ్గర ఉంటుందని అది వారు వివిధ రూపాల్లో దాన్ని ఉపయోగించుకుంటారన్నారు. కానీ ఇప్పుడు మొత్తం మా కూలీల వ్యక్తిగత డేటా అంతా కూడా ఒక ప్రయివేటు ఏజెన్సీకి కట్టబెట్టడం అంటే కూలీల వ్యక్తిగత సమాచారాన్ని వాళ్ల ఏ రకంగా ఉపయోగించుకుంటారో ఆందోళన కలిగిస్తోందనన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎప్పటినుంచో అడుగుతున్న జాబ్ కార్డులను అప్డేట్ చేసి కొత్తవి ఇవ్వాలన్నారు. ఐడెంటి కార్డులు ఇవ్వాల్సి వస్తే ఉపాధి హామీలో పనిచేస్తున్న సిబ్బంది మాత్రమే కార్డులు జారీ చేయాలని, వాటి ఖర్చును ప్రభుత్వమే భరించాలన్నారు. వసూళ్ల సొమ్మును తిరిగి కూలీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కూలీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

సంబరాలు సరే.. పందేల మాటేంటి..!

సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఎప్పటిలానే ఈ సంవత్సరం కూడా సాంప్రదాయం పేరుతో సంక్రాంతి సంబరాలు రెండు జిల్లాల్లో పెద్ద ఎత్తున నిర్వహించారు. ప్రధానంగా విద్యాసంస్థల్లో ప్రారంభించిన సంక్రాంతి సంబరాలు పలు పట్టణాల్లో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలోనూ కొనసాగాయి. అదే సమయంలో పలువురు ఎంఎల్ఎలు, అధికార పార్టీ నేతల ఆధ్వర్యంలోనూ సంక్రాంతి సంబరాలను కనులవిందుగా నిర్వహించారు. ప్రభుత్వ విధానాల ఫలితంగా కనుమరగవుతున్న హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, రంగవల్లులు ఇలా చెప్పుకుంటూ పోతే మానసికోల్లాసం కలిగించే పలు అంశాలు ఈ సంబరాల్లో భాగంగా దర్శనమిచ్చాయి. చిన్నారుల సంప్రదాయ వస్త్రధారణ, నృత్యాలు, కళాప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక భోగిమంటల నుంచి ముగ్గుల పోటీ వరకు అందరినీ అలరించాయి. ఈ సంబరాల్లో జిల్లా అధికారులు సైతం భాగస్వామ్యులయ్యారు. అయితే సంక్రాంతి విశిష్టత సంప్రదాయాల గురించి తప్ప కోడిపందేల గురించి నేతలెవ్వరూ ఉలుకుపలుకు లేకుండా ఉండడం చర్చనీయాంశమైంది. అదే సమయంలో జిల్లా అధికారులు ప్రధానంగా కలెక్టర్, ఎస్‌పి రెండు జిల్లాలోనూ ఎట్టి పరిస్థితుల్లోనూ కోడిపందేల నిర్వహణను అడ్డుకుని తీరుతామని, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో పాటు మండల, గ్రామస్థాయిలో కూడా పందేల నిర్వహణను అడ్డుకునేందుకు కమిటీలను సైతం ఏర్పాటు చేసి రంగంలోకి దించారు. రెండు జిల్లాల్లోనూ గతంలో మాదిరిగానే పలుచోట్ల బరులు ధ్వంసం చేసినట్లు అధికారులు ఘంటాపథంగా ప్రకటించారు. దీంతో పాటు పలుచోట్ల పందేలకు వ్యతిరేకంగా ఫ్లెక్సీల ఏర్పాటు చేయడంతో పాటు పందేలు నిర్వహిస్తే సంబంధిత స్థల యజమానులపైనా కేసులు నమోదు చేస్తామని ప్రకటించారు. ఇవన్నీ చూస్తే ఇంకెముంది హైకోర్టు ఆదేశాల మేరకు పందేలు రెండు జిల్లాలోనూ జరగవని జనం అనుకుంటారు. అయితే ఈ ఫీంకారాలు, కమిటీలు సంక్రాంతి ప్రారంభం రోజైన భోగి నుంచి ముక్కనుమ వరకూ నాలుగు రోజులు ఏ మేరకు పనిచేస్తాయో వేచి చూడాలి. ఎందుకంటే ఆ నాలుగు రోజులు జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి అధికారుల వరకు పత్తా లేకుండా పోవడంతో పాటు ఫోన్లు కూడా పనిచేయని పరిస్థితి చాలా కాలంగా చూస్తూనే ఉన్నాం. ప్రధానంగా భోగి రోజు ఉదయం డింకి పందేల పేరిట అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు కోళ్లకు కత్తులు కట్టకుండా పందేలు నిర్వహించడం సర్వసాధారణంగా మారింది. ఇదేమంటే సాంప్రదాయమని, కత్తులు కట్టడంలేదు కదా అని సమాధానం ఇవ్వడం గమనార్హం. ఈ డింకి పందేలు ప్రారంభించిన గంట తర్వాత పందెంరాయుళ్ల జూలు విదిల్చి యథేచ్ఛగా కోడిపందేలు సాగించడం సర్వసాధారణంగా మారింది. ఆ బరుల వద్ద మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు సాగిస్తున్నా పట్టించుకునే నాధుడే ఉండడు. గుండాట, పేకాట వంటివి అడ్డూఅదుపు ఉండని పరిస్థితి. మరి ఈ సంక్రాంతి ఎప్పటిలానే పందేల సంక్రాంతిగా మిగిలుతుందా లేక హైకోర్టు ఆదేశాల మేరకు ప్రజాసంక్రాంతిగా నిలుస్తుందో వేచి చూడాలి.

ఏజెన్సీలోని ఐదు మండలాల్లో పీసా కమిటీ ఎన్నికలు చాలావరకు పూర్తయ్యాయి. పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడుల్లో పీసా కమిటీ ఎన్నికలు ఎక్కడా అల్లర్లకు, తగాదాలకు తావు లేకుండా ప్రశాంతంగా సాగడం విశేషం. పలుచోట్ల కమిటీల ఎన్నిక ఏకగ్రీవమవ్వగా మరికొన్నిచోట్ల ఎన్నికలు జరిగినా ప్రశాంతంగానే ఎన్నికల ప్రక్రియ పూర్తవ్వడం గిరిజనుల చైతన్యానికి నిదర్శనం. ఎక్కడైనా ఎన్నికలు నిలిచినా, తగాదాలు తలెత్తినా ప్రధాన కారణం ప్రభుత్వం, అధికారుల అనాలోచిత చర్యల ఫలితమే అని చెప్పొచ్చు. కొన్నిచోట్ల నిర్వాసిత కాలనీలను నిర్మించినా అక్కడ ప్రత్యేకంగా పీసా కమిటీ ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వకుండా సమీప గ్రామ కమిటీలోనే కలపడంతో వివాదాలు తలెత్తాయి. మరికొన్నిచోట్ల ప్రచారం సరిగా లేక ఫోరం లేక ఎన్నిక నిలిచిపోయింది. ఎన్నికలు నిర్వహించిన అధికారులు నిలిచిపోయిన కమిటీల ఎన్నికలు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అదే సమయంలో పీసా కమిటీలు సమర్ధవంతంగా నడిచేలా జిల్లా, మండల అధికారులు సహకరించాల్సిన అవసరం ఉంది.

- వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

స్టార్టప్‌ల ప్రోత్సాహానికి ఎపిఐఐసి సహకారం

ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు

భీమవరం టౌన్: స్టార్టప్‌లు ప్రోత్సహించేందుకు ఎపిఐఐసి స్థలాలు కూడా ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని ఉండి మాజీ ఎంఎల్ఎ, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు హామీ ఇచ్చారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్(సిఎస్‌డి), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(సిఎస్ఐటి) శాఖల సంయుక్త ఆధ్వర్యంలో చిన అమిరంలో నూతనంగా స్మార్ట్ వాష్ లాండ్రీ క్లీనింగ్ సర్వీస్ షోరూమ్ పేరిట నూతన టెక్నాలజీతో ఏర్పాటు చేసిన షాపును ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు శనివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల కృషిని అభినందించారు. అవసరమైతే పట్టణంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో స్థలాలు కూడా అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కం కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ మాట్లాడుతూ తమ కళాశాలలో ఇప్పటికి పెద్ద ఎత్తున విద్యార్థులు సొసైటీకి ఉపయోగపడే స్టార్టప్‌లు ప్రారంభించి మంచి ఫలితాలు సాధిస్తున్నారన్నారు. అనంతరం స్మార్ట్ వాష్ పోస్టర్‌ను మంతెన రామరాజు ఆవిష్కరించారు. కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు, డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యాన కుట్టు మిషన్ వితరణ

గణపవరం : మానవత సంస్థ ప్రజలకి మరింత సేవలందించాలని గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబీ శ్రీలక్ష్మి అన్నారు. శనివారం మానవత జిల్లా నాయకులు కాకర్ల వినాయక కార్యాలయం వద్ద పృథ్వీ నివాసులు ముదునూరి నాగమణి స్వయం ఉపాధికు రూ.6,500 విలువచేసే కుట్టుమిషన్ ఆర్.బేబీ శ్రీలక్ష్మి అందజేశారు. లయన్స్ క్లబ్ గణపవరం నాయకులు పి.సత్యనారాయణ మూర్తి, మానవత నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

భీమవరం టౌన్ : భోపాల్‌లో జరిగిన 68వ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ రైఫిల్ షూటింగ్ కాంపిటీషన్‌లో భీమవరం ఛాంపియన్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచడం గొప్ప విశేషమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. ఈనెల 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు భోపాల్‌లో 68వ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ రైఫిల్ షూటింగ్ పోటీలు జరగగా దానిలో దేవరపు సాయిశ్రావ్య 22వ ర్యాంక్, అల్లు లిఖిత్‌రామ్ 39వ ర్యాంకులను సాధించారు. జాతీయస్థాయి పోటీలలో పాల్గొని ర్యాంకులు సాధించడం అభినందనీయమని విద్యార్థులను ఎంఎల్ఎ అంజిబాబు అభినందించారు.

రహదారి పనులు ప్రారంభం

పాలకొల్లు రూరల్ : మండలంలోని శివదేవుని చిక్కాల గ్రామం నుంచి తిల్లపూడి పాలెం వరకు 6 కిలోమీటర్ల పొడవు గల రోడ్డు ఆర్అండ్‌బి రహదారి పనులను రూ.85 లక్షలతో కూటమి నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కామిశెట్టి అయ్యప్ప నాయుడు, నడపన జగపతిరావు, నీలం తాతాజీ, ఇంటి శ్రీరాములు, బోడపాటి కాశీ విశ్వనాథం, దిడ్ల రామాంజనేయులు, ఎంపిటిసి నడపన నరసింహారావు స్వామి, నడపన బాబ్జి, పాముల రజనీకుమార్, రాయి ప్రసాద్, అంగార వీరభద్ర కుమార్, అంకోటి వీరభద్రం, పెనుమత్స శ్రీనివాసరాజు, వడ్డేగన్ని, బొప్పనపల్లి రంగారావు, నడపన మధుసూదన్ రావు పాల్గొన్నారు.

కోడిపందేలను ఆపాలని వినతి

నరసాపురం : సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు, జూదం, పేకాట వంటి చెడు సాంప్రదాయాలను ప్రోత్సహిస్తూ వాటిని నిర్వహించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని పందేలను నిలుపుదల చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో నరసాపురం డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేదకు వినతి పత్రం అందజేశారు. సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు బోడిద జోగేశ్వరరావు, కోడి లక్ష్మణరావు పాల్గొన్నారు.

తణుకు : సాంప్రదాయ ముసుగులో కోడిపందేలు, గుండాట, పేకాట, తాగుడు వ్యసనాలతో సంక్రాంతి పండగ నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం వెంటనే వీటిని అరికట్టాలని, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం జరగవరం మండల పోలీస్ స్టేషన్ అధికారులకు ఈమేరకు వినతిపత్రాన్ని అందజేశారు. సిపిఎం మండల కన్వీనర్ కామన మునిస్వామి, నాయకులు గుత్తుల రామాంజనేయులు, గుత్తుల శివయ్య, పెన్నెటి సుబ్బారావు, జక్కంశెట్టి గంగాధరరావు పాల్గొన్నారు.

నరసాపురం : సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు, మద్యం అక్రమ విక్రయాలు నివారించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ డిమాండ్ చేశారు. శనివారం ఐద్వా ఆధ్వర్యంలో పట్టణ నరసాపురం డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద, నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజుకు వినతిపత్రాన్ని అందించారు.

విద్యుత్ బిల్లులు భోగిమంటల్లో వేయాలి

తణుకు : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కరెంట్ ఛార్జీలు వెంటనే ఉప సంహరించుకోవాలని, విద్యుత్ బిల్లులు భోగి మంటల్లో వేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్, పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయకుమారిలు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక అమరవీరుల భవనంలో కమిటీ సమావేశం జరిగింది. పెరిగిన విద్యుత్ బిల్లులు భోగి మంటల్లో వేయాలని ప్రజలను కోరారు. సిపిఎం నాయకులు గుబ్బల గోపి, కె.నాగరతనం పాల్గొన్నారు.

సంక్రాంతి పేరుతో దోపిడీ

మొగల్తూరు : సంక్రాంతి పండుగ పేరుతో ప్రభుత్వం ప్రజల నుంచి నిలువు దోపిడీ చేస్తుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగతోటి సత్యనారాయణ విమర్శించారు. మొగల్తూరులోని సిపిఎం కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు యడ్ల చిట్టిబాబు, వీర పాండురంగారావు, జి.పెద్దిరాజు, ఎ.సీతారత్నం ఉన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

తాడేపల్లిగూడెం : పేదల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో శనివారం గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ త్రికాల ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ జనార్దన్ రావు, ఉమ దంపతులు, బిడిఆర్ కళా కేంద్ర వ్యవస్థాపకులు బుద్దాల వెంకట్రావు చేతుల మీదుగా నూతన దుస్తులు పంపిణీ చేశారు. జనార్దన్ మాట్లాడుతూ గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు త్రికాల ఆధ్వర్యంలో జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా 42 మహిళలకు, 22 మంది పురుషులకు నూతన దుస్తులు అందించారు.

పట్టణ సుందరీకరణకు దాతల కృషి అభినందనీయం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం నియోజకవర్గాన్ని సుందరీకరణ చేయడానికి అన్ని సంఘాలు ముందుకు వస్తున్నాయని, భీమవరం ఎంతో అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. శ్రీఅన్నపూర్ణమ్మ అన్నదాన సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు, విగ్రహ దాత తమిరి శరత్ సహకారంతో సుమారు రూ.2 లక్షలతో భీమవరం ఓవర్ బ్రిడ్జి వద్ద 'స్వాగతం-సుస్వాగతం పలికే శ్రీమూర్తుల శిల్పకళ' విగ్రహాలను శనివారం ఎంఎల్ఎ అంజిబాబు ఆవిష్కరించారు. ఇప్పటికే ఎంతో అభివృద్ధి చేసుకున్నామని, పట్టణ సుందరీకరణకు అందరూ ముందుకు రావడం అభినందనీయమని ఎంఎల్ఎ అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, కారుమూరి సత్యనారాయణ మూర్తి, విజ్జురోతి రాఘవులు పాల్గొన్నారు.

రీసర్వేపై అవగాహన

తాడేపల్లిగూడెం : రీసర్వే ప్రాజెక్టులో భాగంగా శనివారం మండలంలోని నవాబ్ పాలెం గ్రామంలో తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రీసర్వేకు సంబంధించిన వివరాలను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మద్దుకూరి గంగాభవాని, టిడిపి గ్రామ నాయకులు మద్దుకూరి ధనరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

మద్యం విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో మల్లపురాజు పేట డప్పింగ్ యార్డు వద్ద మద్యం అమ్ముతున్న వ్యక్తిని శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు శనివారం ఉదయం గణపవరం ఎస్ఐ ఆకుల మణికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం డంపింగ్ యార్డు వద్ద మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ మణికుమార్ తన సిబ్బందితో వెళ్ళగా అక్కడ మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని, అతని దగ్గర ఉన్న మద్యం సీసాలను పరిశీలించగా అవి పిప్పర మద్యం షాపులో 17 క్వార్టర్ బాటిల్స్‌గా గుర్తించారు. వీటితో పాటు గోవా నుంచి తెచ్చిన 7 ఫుల్ బాటిళ్లని కూడా స్వాధీనం చేసుకొని ఆ వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

471 గ్రాముల బంగారు వస్తువులు స్వాధీనం : డిఎస్‌పి విశ్వనాథ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం పట్టణంలో రాత్రుళ్ల ఇంటి తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం డిఎస్‌పి డి.విశ్వనాథ్ తెలిపారు. శనివారం పట్టణ పోలీస్ స్టేషన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లాకు చెందిన జంగాల స్వరూప్ కుమార్(40) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా తాడేపల్లిగూడెం పట్టణంలో ఆరు, రావులపాలెంలో ఒకటి మొత్తం 7 నేరాలు చేసినట్లు ఒప్పుకున్నాడని డిఎస్‌పి తెలిపారు. అతని వద్ద నుంచి సుమారు రూ.36 లక్షలు విలువచేసే 471 గ్రాముల బంగారం వస్తువులను స్వాధీన పరుచుకున్నామని తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు విషయంలో అత్యంత చాకచక్యంగా వ్యవహరించిన తాడేపల్లిగూడెం పట్టణ సిఐ ఎ.సుబ్రహ్మణ్యం, ఎస్ఐలు పి.నాగరాజు, బి.శ్రీనివాసు, క్రైమ్ పోలీసు సిబ్బంది పి.శ్రీనివాస్, ఎ.దుర్గాప్రసాద్, రెడ్డి మోహన్, కె.మహేష్, కె.రాజులను జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి అభినందించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

రూ.24 కోట్లతో భీమవరంలో క్రిటికల్ కేర్ సెంటర్

వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి - ఆకివీడు

జిల్లా కేంద్రం భీమవరంలో త్వరలో రూ.24 కోట్లతో క్రిటికల్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. వాటిలో ఏడు కోట్ల రూపాయల మిషనరీలు, పనిముట్లు, మరో 17 కోట్ల రూపాయల నిర్మాణాలకు ఇతర అవసరాలకు వినియోగిస్తారని ఆయన తెలిపారు. ఈ కేంద్ర భవన నిర్మాణానికి అతి త్వరలో భూమి పూజ చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. శనివారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన 30 పడకల ఆసుపత్రి భవనాన్ని, నాలుగు పడకల డయాలసిస్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నెఫ్రాలజిస్ట్ కొరత తీవ్రంగా ఉందని, వాటిని అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఉద్దానంలో 34 వేల మంది కిడ్నీ బాధితులు ఉండగా 4 వేల మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. అంతటి తీవ్రమైన కొరతను అధిగమించడానికి భీమవరం నుంచి ఆకివీడు వచ్చి నెఫ్రాలజీ అవసరాలు తీర్చడానికి డాక్టర్ అశోక్ వర్మ అంగీకరించడం ఎంతైనా అభినందనీయమన్నారు. ఇకనుండి ఆయన వారానికి రెండుసార్లు వస్తారని ప్రకటించారు. సమావేశంలో డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ నియోజకవర్గం మొత్తం అతి త్వరలో సుందరనందనగా తీర్చిదిద్దాలనేది తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నాగరాణి, ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డి, హెచ్ఒ నాయక్, జిల్లా వైద్య కోఆర్డినేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పోలిశెట్టి శ్రీనివాస్

పేదలకు అండగా ప్రజాశక్తి

నరసాపురం : ప్రస్తుత పోటీ ప్రపంచంలో కార్పొరేట్ పత్రికలకు పోటీగా, పేదలకు అండగా ప్రజాశక్తి పత్రిక నిలుస్తుందని జనసేన సీనియర్ నాయకులు పోలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొప్పర్రు గ్రామంలో ఆయన స్వగృహంలో ప్రజాశక్తి 2025 క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా సమస్యలను అను నిత్యం వెలికితీస్తూ, నిర్భయంగా వార్తలు ప్రచురించే సామర్థ్యం ప్రజాశక్తికి సాధ్యమన్నారు. ప్రజలకు, అధికారులకు, రాజకీయ నాయకులకు మధ్య ప్రజాశక్తి వారధిగా నిలుస్తుందన్నారు. ప్రజాశక్తి యాజమాన్యానికి, ఉద్యోగులకు, సిబ్బందికి, విలేకర్లకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

నేడు వివిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు

ఆకివీడు : మండలంలోని వివి గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవాలకు అంగరంగ వైభవంగా ముస్తాబైంది. ఈనెల 12న కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపక బృందం, అభివృద్ధి కమిటీ ప్రణాళికా సంఘాల సమన్వయంతో ఈ ఉత్సవాలు రూపుదిద్దుకుంటున్నాయి. ప్రముఖ విద్యాదాత, అభినవభోజుడుగా పేరుగాంచిన సర్వోదయ నాయకుడు, మాజీ మంత్రి చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు తన తండ్రి పేరిట స్థాపించిన బాపిరాజు ధర్మ సంస్థ ద్వారా ఈ కళాశాల 1974లో స్థాపించారు. అంతకుముందే 1972లో అదే ప్రాంగణం వద్ద రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు శతజయంతి సందర్భంగా జూనియర్ కళాశాల స్థాపించారు. ఆ కళాశాల రెండు సంవత్సరాలు పూరై మూడో సంవత్సరంలో అడుగుపెట్టడంతో అదే విద్యార్థులతో డిగ్రీ బిఎ బికాంలు ప్రారంభించారు. ఎక్కడో కొల్లేటి తీరాన మారుమూలలో కళాశాల విద్యకు నోచుకోని ఎందరికో ఈ కళాశాల ఒక వరంగా మారింది. వారి పాలిట మూర్తి రాజు ఒక ఆశా దీపంగా వెలిశారు. ప్రయివేటు కళాశాలలకు దీటుగా అన్ని సౌకర్యాలతో పాటు 18 ఎకరాల అతిపెద్ద క్రీడా ప్రాంగణం కలిగిన ఈ కళాశాల ఇన్ని బాలారిష్టాలు దాటి ఒక స్థాయికి చేరి ఈనెల 12వ తేదీన ఆదివారం ఆడంబరంగా స్వర్ణోత్సవాల నిర్వహించుకుంటోంది. ఈ స్వర్ణోత్సవాలకు కేంద్ర మంత్రి, స్థానిక పార్లమెంటు సభ్యులు భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర డిప్యూటీ స్పీకర్, స్థానిక ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణ రాజుతో పాటు పలు విద్యాశాఖ ప్రముఖులు, ఈ కళాశాలలో విద్యను అభ్యసించి, జాతీయ స్థాయిలో ఉన్నత స్థానంలో ఉన్నటువంటి పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్లు నిర్వహణ సంఘం అధ్యక్షులు గొంట్ల కృష్ణమూర్తి, నేరెళ్ల చంచయ్య, గుర్రం ఈశ్వరరావు, రాజరాజేశ్వరిలు తెలిపారు.

కోడిపందేలకు బరులు సిద్ధం..!

ప్రజాశక్తి - తణుకు రూరల్

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించే కోడిపందేల బరులను నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. తణుకు మండలంలో దువ్వ, తేతలి, తేతలి వై జంక్షన్ సమీపంలో బరల ఏర్పాటుకు భూములను చదును చేస్తూ, పందిర్లు వేస్తూ కనిపించారు. ఒకవైపు రెవెన్యూ, పోలీస్ అధికారులు హైకోర్టు ఆదేశాల మేరకు కోడిపందేలు, జూద క్రీడలు నిషేధించడంలో భాగంగా ఇప్పటికే మండల పరిధిలో 77 మందిని బైండోవర్ చేసినట్లు చెబుతున్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే పండగ ముందు కోడిపందేలు అడ్డుకుంటామని సవాల్ చేసే పోలీసులు చివరలో రాజకీయ ఒత్తిళ్లకు చూసిచూడనట్లు వ్యవహరిస్తారా లేక ఈసారి వీటిని ఎదుర్కొని తీరుతారా అనేది వేచి చూడాల్సి ఉంది. ఇదిలా ఉండగా తణుకు పట్టణ పరిధిలో ఉన్న లాడ్జీలు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పందెం రాయుళ్ల విడిది కోసం ఆయా బరుల నిర్వాహకులు ముందుగానే గదులు బుక్ చేసి పెట్టుకోవడం గమనార్హం.

కాళ్ల : పోలీసుల హెచ్చరికలు కాదని మండలంలోని టిడిపి నేతలు, వారి అనుచరులు పెద్దఎత్తున బరులు సిద్ధం చేస్తున్నారు. కోడిపందేల నిర్వహణకు అనుమతి లేదని, దిక్కరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు చెబుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. చాలాచోట్ల పలు రాజకీయపార్టీలకు చెందిన వారు పూర్తి స్థాయిలో సిద్ధం కానప్పటికీ వాటిల్లో ఆటల నిర్వహణ కోసం ఇప్పటికే పలువురు పెద్ద మొత్తంలో అడ్వాన్సులు చెల్లించి తమ సొంతం చేసుకున్నాడు. ఆటలతో పాటు బిర్యానీ పాయింట్లు, శీతలపానీయాలు, బెల్టు దుకాణాలను సొంతం చేసుకునేందుకు ఎక్కువ మంది ఎగబడుతున్నారు. నేతల అండదండలతో నిర్వహిస్తున్నారు. నిర్వాహకులకు కొన్నిచోట్ల ప్రజాప్రతినిధులే పరోక్షంగా సహకారం అందిస్తున్నారు. దీంతో పోలీసులు నామమాత్రపు హెచ్చరికలతోనే సరిపెడుతున్నారు. మండలంలోని పెదఅమిరం, సీసలి, కాళ్ల వివిధ ప్రాంతాల్లో భూమి చదును చేస్తున్నారు. కొన్నిచోట్ల సాంప్రదాయ క్రీడలు, సంబరాల పేరుతో ప్రారంభించి, తర్వాత కోడిపందేలు, ఇతర జూదాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. పలు గ్రామాల్లో ఇప్పటికే భారీ సంఖ్యలో పందెం పుంజులను సిద్ధంగా ఉంచారు. కోతముక్క, గుండాట, నంబర్లాట, పేకాట, కోడిపందెం నిర్వహణకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



కాళ్ల : మహిళలకు బహుమతులు అందజేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఉల్లంపర్రు మాంటిస్సోరీస్ స్కూల్, డాక్టర్ సబిత కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంక్రాంతి సంబరాలకి ప్రత్యేక ఆహ్వానితులుగా రోటరీ క్లబ్ పాలకొల్లు ప్రెసిడెంట్ రావాడ సతీష్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. డాక్టర్ సబిత కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మద్దాల వాసు, స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ మద్దాల రాంప్రసాద్ భోగి మంటను అంటించి ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. ఈ కార్యక్రమంలో సంక్రాంతి పండుగ సాంప్రదాయం ఉట్టిపడేలా ఏర్పాటు చేసినటువంటి ప్రభలు, భోగి మంటలు, గొబ్బెమ్మలు, పొంగలి, బొమ్మల కొలువు, రంగవల్లులు, నింగిని తాకే పతంగులు చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, హరిదాస్, కొమ్మదాసరి, సోదమ్మ, జంగాదేవర, పిట్టల దొర, రైతు వంటి వేశధారణలు మొదలైనవి చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మద్దాల వాసు మాట్లాడుతూ సంక్రాంతి 3 రోజులు జరుపుకునే పండుగ విశిష్టత గురించి పిల్లలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరి జవ్వాది కళ్యాణ్, ట్రెజరర్ పోతబత్తుల సత్యనారాయణ, లయన్స్ క్లబ్ పాలకొల్లు ప్రెసిడెంట్ జై.భరత్ రెడ్డి పాల్గొన్నారు.

కాళ్ల : మండలంలోని కాళ్లకూరు గ్రామంలో శనివారం సంక్రాంతి పండుగ సందర్భంగా దాట్ల శ్రీదేవి ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలను ఆకివీడు డిసిసిబి ఛైర్మన్ గోకరాజు శివరామరాజు ప్రారంభించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు వేసిన వివిధ రంగవల్లులు పలువురిని ఆకట్టుకున్నాయి. పోటీల్లో పాల్గొనే అందరికీ ట్రస్ట్ నుంచి బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన ముగ్గులకు ఉప సభాపతి, ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు చేతుల మీదుగా ఈనెల 12వ తేదీన బహుమతులు అందించనున్నామని ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకట రామరాజు తెలిపారు. జి.నాగమణి మొదటి బహుమతి గ్రైండర్, ఎం.మౌనిక రెండవ బహుమతి మిక్సీ, ఎం.యశోద మూడో బహుమతి కుక్కర్‌లు సాధించినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకట రామరాజు, దాట్ల లక్ష్మీదేవి, మాజీ ఎంపీ వేగేశ్న వెంకటగోపాలకృష్ణంరాజు, ముదునూరి శిరీష, ముదునూరి క్రితి వర్మ, మాజీ జెడ్‌పిటిసి అడ్డాల పద్మావతి నాగరాజు, సాదు శ్రీనివాస్, కాళ్ల ఎస్ఐ శ్రీనివాస్, అడ్డాల గణపతిరాజు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరు పంచాయతీ గుంటపల్లవ పాలెంలోని అంగన్వాడీ కేంద్రం ఆవరణలో ముందుగా సంక్రాంతి సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు రంగవల్లులు, మ్యూజికల్ ఛైర్స్ తదితర పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో వచ్చిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ఎ.సీతారత్నం, ఉపాధ్యాయులు, పలువురు గ్రామస్తులు ఉన్నారు.

తణుకు : తెలుగు సాంప్రదాయాలను, పండుగల ప్రత్యేకతను, సంక్రాంతి విశిష్టతను తెలిసేలా తణుకు పట్టణంలో స్థానిక మాంటిస్సోరి పాఠశాలలో సంక్రాంతి లోగిళ్లు-సంస్కృతి సాంప్రదాయాల సమాహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి సంబరాలను మినందుకొనేలా సాంస్కృతిక నృత్యాలతో పల్లె వాతావరణాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తణుకు నియోజకవర్గ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ సతీసమేతంగా విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జ్ఞానమంజరి, కాలేజ్ ఎకడమిక్ డైరెక్టర్ కిషోర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి : సిఐ

పెనుమంట్ర : రోడ్డు మీదకు వచ్చాక ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించడం బాధ్యతగా భావించాలని పెనుగొండ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని మార్టేరు గ్రామంలో ఎలిపి దంత వైద్యశాల నిపుణులు డాక్టర్ నూలి సందీప్ వితరణతో పోలీస్ శాఖకు అందజేసిన రోడ్డు ట్రాఫిక్ బార్ కేడ్స్‌ను ఆయన ప్రారంభించారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, అందరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఆయన కోరారు. మార్టేరులోని అత్యంత బిజీగా ఉండే నాలుగు రోడ్ల సెంటర్‌లో నియంత్రణ కోసం ట్రాఫిక్ భారీ కేడ్‌లను అందించి, సహాయ సహకారాలు అందించిన డాక్టర్ నూలి సందీప్‌ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కోయ వెంకట కార్తిక్, నార్కెడి మిల్లి దీపక్ పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడు స్వామి వివేకానంద

గణపవరం: భారత జాతి ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలలో చాటి చెప్పిన నవయుగ వైతాళికుడు స్వామి వివేకానందని గణపవరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి, రుద్రరాజు ఫౌండేషన్ అధ్యక్షులు ఆర్‌విఎస్.రాజు అన్నారు. స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా స్థానిక కాలేజీలో జరిగిన జయంతి సభలో పాల్గొని మాట్లాడారు. జనవరి 12న జాతీయ యువజన దినోత్సవం నిర్వహించటం పరిపాటి అని అన్నారు. అనంతరం ఆర్.విజయరామరాజు(యుఎస్ఎ) అందిస్తున్న యువత కోసం ప్రోత్సహం 2025 అనే పురస్కారాన్ని మండలంలో అత్యధిక ప్రతిభ కనబరిచిన ఆదూరి శివకృష్ణ అందజేశారు. అనంతరం వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

విష్ణు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

బివిఆర్ ఐటి కాలేజ్, నర్సాపూర్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన విష్ణు నేషనల్ కాంక్రీట్ కానోయి కాంపిటీషన్-2025లో కాంక్రీట్ కానోయి రేసులో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు తృతీయ బహుమతిని విష్ణు ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సివిల్ విద్యార్థులు సాధించారని విష్ణు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మంగం వేణు తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విష్ణు నేషనల్ కాంక్రీట్ కానోయి కాంపిటీషన్-2025లో దేశవ్యాప్తంగా మొత్తం 16 టీమ్స్ పాల్గొన్నాయని, ఫైనల్ రౌండ్లో వివిధ విభాగాల్లో ఎండూరెన్స్ రేస్‌లో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులు ఎం.షాలీం రాజు, ఎల్.మాణిక్యం నాయుడు, ఎస్.యశస్విని, ఆర్.దీప్తి, బి.యశ్వంత్, సి.పవన్ వెంకట శివ కుమార్, మన్యూరబిలిటీ రేసులో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులు పి.మౌని సాయి, ఎ.రోహిత్ సాయి రెడ్డి, కె.సాయి కృష్ణవేణి, వి.ఫణి సాయి గాయత్రి, జె.నాగ గణేష్, కె.వాసవి దేవి, ద్వితీయ బహుమతి సాధించిన విద్యార్థులు పి.లిఖీదర్ నాయుడు, ఎం.నౌవాహు కుమార్, షేఖ్ చేషుమియ, బి.చిన్న, బి.హేమలత, ఎన్.పవిత్ర, స్ప్రింట్ రేసులో తృతీయ బహుమతులతో తమ విద్యార్థులు ప్రతిభ కనబరించినందుకు చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తృతీయ బహుమతి సాధించిన విద్యార్థులు ఎం.షాలీం రాజు, ఎల్.మాణిక్యం నాయుడు, ఎస్.యశస్విని, ఆర్.దీప్తి, బి.యశ్వంత్, సి.పవన్ వెంకట శివ కుమార్, ఫ్యాకల్టీ మెంటర్స్ వివిఎస్.శర్మ, పి.ఫయాజ్, కెఎస్.సాయి కుమార్‌లను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మంగం వేణు అభినందించారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నరసాపురం: జనసేన కార్యాలయంలో శనివారం పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పంపిణీ చేశారు. అనారోగ్యానికి గురై చికిత్స చేయించుకుని ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న ఇద్దరికి బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం మొత్తం రూ.1.37 లక్షల చెక్కులను అందించారు. కొల్లాటి గోపికృష్ణ, అందే దొరబాబు పాల్గొన్నారు.

సౌత్ జోన్ వాలీబాల్ పోటీలు ప్రారంభం

పాలకొల్లు : పాలకొల్లులో సౌత్ జోన్ వాలీబాల్ పోటీలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. అయితే జిల్లా కలెక్టర్ అందుకు నిరాకరించారు. అప్పటికే సాయంత్రం 6 గంటలు కావడంతో ఆ సమయంలో జాతీయ పతాకం ఎగురవేయకూడదని కలెక్టర్ నిరాకరించారు. దీంతో మంత్రి ఆమెను క్రీడా పతాకం ఎగురవేయాలని కోరడంతో జిల్లా కలెక్టర్ ఎగురవేశారు.

కోడిపందేల బరులు ధ్వంసం

ఆచంట : మండలంలో ఎవరైనా కోడిపందేలు నిర్వహించినా, ఆడినా చట్టరీత్యా నేరమని తహశీల్దార్ జి.కనకరాజు హెచ్చరించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలో ఆచంట, కొడమంచిలి, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం కోడిపందేల బరులను పరిశీలించి ధ్వంసం చేశారు. అనంతరం పోలీసులు హెచ్చరిక బోర్డులను కట్టారు.

గోకులం షెడ్లు ప్రారంభం

పెనుగొండ : గోకులం షెడ్ల ప్రారంభోత్సవం ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ చేతుల మీదుగా పెనుగొండలో ప్రారంభించారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ గోవులను సంరక్షణ కోసం ప్రతిష్టాత్మంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కొవ్వూరు వారి కోర్టులో
O.S. No. 516/2014

Between:
ఎస్.ఎస్.వి.రామ సత్యనారాయణ -వాది
మరియు
శెట్టి మీనాక్షి, వగైరాలు -ప్రతివాదులు
శెట్టి అరుణ్ సాయి -3వ ప్రతివాది

3వ ప్రతివాది: శెట్టి అరుణ్‌సాయి, S/o. లేటు శ్రీనివాసు, వయస్సు 22 సంIIలు, హిందూ, R/o. D.No. 13-5-3/1, గుంటువారి వీధి, నల్లవారి వీధి ఎదురుగా, వెంకటరామ థియేటర్ దగ్గర, పాతూరు, తణుకు, పశ్చిమగోదావరి జిల్లా.

పై నెంబరు దావాలో 3వ ప్రతివాది అయిన శ్రీ శెట్టి అరుణ్‌సాయి కి రిజిస్టర్ పోస్ట్ మరియు కోర్టు వారి ద్వారా సమన్లు అమలు కానందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు సబ్‌స్టిట్యూట్ సర్వీస్ ద్వారా **ది. 24-01-2025వ తేదీన వాయిదా అయి ఉన్నదని, ఆరోజు ఉదయం 10.30 గంటలకు** శ్రీ శెట్టి అరుణ్‌సాయి స్వయంగా గాని, లేక వకీలు ద్వారా గాని శ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కొవ్వూరు వారి కోర్టు నందు హాజరు కావలసి ఉన్నదని, అలా కాని పక్షమున మీ పరోక్షమున కేసు తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

పి.సూర్యనారాయణ, న్యాయవాది
నిడదవోలు, సెల్: 98496 82517

మహారాజశ్రీ VII Addi జిల్లా జడ్జి Family Court ఏలూరు, పIIగోIIజిల్లా
I.A. No. 224/2024 In
A.S. No. 13/2020

Between:
శ్రీమతి అల్లు జయలక్ష్మి ...*Petitioner /Appellant*
AND
కర్పూరం స్వరాజ్యలక్ష్మి (Died) and Others
...*Respondents /Respondents*

పై నెంబరు గ్రంధములో కర్పూరం స్వరాజ్యలక్ష్మి మరణించినందు వలన ఆమె వారసులైన 3, మరియు 4 ప్రతివాదులుగా మిమ్మల్ని అనగా (R3) కర్పూరం నైమిష D/o సత్యనారాయణ R/o D.No. 7D-5/1-5, పాటిమల్లవారి సందు, ఏడుకాలువలు రోడ్డు, తూర్పు వీధి, ఏలూరు (R4) కర్పూరం హిందుజ D/o సత్యనారాయణ R/o D.No. D-5/1-5, పాటిమల్లవారి సందు, ఏడుకాలువలు రోడ్డు, తూర్పు వీధి, ఏలూరు వార్లకు నోటీసు అమలు నిమిత్తం **ది. 31-01-2025 తేదీన ఉదయం గంII 10.30 నిIIలకు** పైకోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేని యెడల తమ పరోక్షమున దావా సంగతులు తీర్మానించబడును.

కానాల రామకృష్ణారావు
ఏలూరు అడ్వకేట్,
11-01-2025 ఏలూరు
సెల్: 9390004053

మహారాజశ్రీ VII Addi జిల్లా జడ్జి Family Court ఏలూరు, పIIగోIIజిల్లా
I.A. No. 225/2024 In
A.S. No. 13/2020

Between:
శ్రీమతి అల్లు జయలక్ష్మి ...*Petitioner /Appellant*
AND
కర్పూరం స్వరాజ్యలక్ష్మి (Died) and Others
...*Respondents /Respondents*

పై నెంబరు గ్రంధములో కర్పూరం స్వరాజ్యలక్ష్మి మరణించినందు వలన ఆమె వారసులైన 3, మరియు 4 ప్రతివాదులుగా మిమ్మల్ని అనగా (R3) కర్పూరం నైమిష D/o సత్యనారాయణ R/o D.No. 7D-5/1-5, పాటిమల్లవారి సందు, ఏడుకాలువలు రోడ్డు, తూర్పు వీధి, ఏలూరు (R4) కర్పూరం హిందుజ D/o సత్యనారాయణ R/o D.No. D-5/1-5, పాటిమల్లవారి సందు, ఏడుకాలువలు రోడ్డు, తూర్పు వీధి, ఏలూరు వార్లకు నోటీసు అమలు నిమిత్తం **ది. 31-01-2025 తేదీన ఉదయం గంII 10.30 నిIIలకు** పైకోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేని యెడల తమ పరోక్షమున దావా సంగతులు తీర్మానించబడును.

కానాల రామకృష్ణారావు
ఏలూరు అడ్వకేట్,
11-01-2025 ఏలూరు
సెల్: 9390004053

మహారాజశ్రీ అడిషనల్ సివిల్ జడ్జి వారి కోర్టులో, పాలకొల్లు
I.A. No. 318/2024 In
O.S. No. 35/2023

బిట్వీన్:
పొట్నూరి సత్య కిషోర్ -పిటీషనరు/వాది
మరియు
వేండ్రపు లక్ష్మణరావు (లేటు) మరియు అనదర్స్
రెస్పాండెంట్లు -ప్రతివాది

టు:
2: వేండ్రపు సత్యనారాయణ, తండ్రి: (లేటు) లక్ష్మణరావు, హిందు, పురుషుడు, C/o. వేండ్రపు సీతమ్మ, డోర్ నెం. 2-9-16, లెనిన్ హైస్కూల్ రోడ్డు, రోయపేట, నరసాపురం, నరసాపురం మండలం, పIIగోIIజిల్లా.
2వ రెస్పాండెంటు -ప్రతిపాదిత ప్రతివాది
3: వేండ్రపు తేజ, తండ్రి: (లేటు) లక్ష్మణరావు, హిందు, పురుషుడు, C/o. వేండ్రపు సీతమ్మ, డోర్ నెం. 2-9-16, లెనిన్ హైస్కూల్ రోడ్డు, రోయపేట, నరసాపురం, నరసాపురం మండలం, పIIగోIIజిల్లా.
3వ రెస్పాండెంటు -ప్రతిపాదిత ప్రతివాది

పై నెంబరు పిటిషను గ్రంధములో రెస్పాండెంట్లు అయిన మీకు కోర్టు ద్వారా మరియు రిజిష్టరు పోస్టుల ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ అందుకొనకుండా కావాలనే ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేయుచూ ఉన్నందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది. **ది. 23-01-2025 వ తేదీన** పై కేసు విషయమై శ్రీయుత కోర్టు వారి ఎదుట **ఉదయం గంII 10 గంIIకు** లగాయితూ హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
(కోర్టు వారి అనుమతితో)

యమ్. నాగపల్లవి
పిటీషనరు తరుపు న్యాయవాది
పాలకొల్లు
సెల్: 9492484235

మహారాజశ్రీ అడిషనల్ సివిల్ జడ్జి వారి కోర్టులో, పాలకొల్లు
I.A. No. 319/2024 In
I.A. No. 46/2023 In
O.S. No. 35/2023

బిట్వీన్:
పొట్నూరి సత్య కిషోర్ -పిటీషనరు/వాది
మరియు
వేండ్రపు లక్ష్మణరావు (లేటు) మరియు అనదర్స్
రెస్పాండెంట్లు -ప్రతివాది

టు:
2: వేండ్రపు సత్యనారాయణ, తండ్రి: (లేటు) లక్ష్మణరావు, హిందు, పురుషుడు, C/o. వేండ్రపు సీతమ్మ, డోర్ నెం. 2-9-16, లెనిన్ హైస్కూల్ రోడ్డు, రోయపేట, నరసాపురం, నరసాపురం మండలం, పIIగోIIజిల్లా.
2వ రెస్పాండెంటు -ప్రతిపాదిత ప్రతివాది
3: వేండ్రపు తేజ, తండ్రి: (లేటు) లక్ష్మణరావు, హిందు, పురుషుడు, C/o. వేండ్రపు సీతమ్మ, డోర్ నెం. 2-9-16, లెనిన్ హైస్కూల్ రోడ్డు, రోయపేట, నరసాపురం, నరసాపురం మండలం, పIIగోIIజిల్లా.
3వ రెస్పాండెంటు -ప్రతిపాదిత ప్రతివాది

పై నెంబరు పిటిషను గ్రంధములో రెస్పాండెంట్లు అయిన మీకు కోర్టు ద్వారా మరియు రిజిష్టరు పోస్టుల ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ అందుకొనకుండా కావాలనే ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేయుచూ ఉన్నందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది. **ది. 23-01-2025 వ తేదీన** పై కేసు విషయమై శ్రీయుత కోర్టు వారి ఎదుట **ఉదయం గంII 10 గంIIకు** లగాయితూ హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
(కోర్టు వారి అనుమతితో)

యమ్. నాగపల్లవి
పిటీషనరు తరుపు న్యాయవాది
పాలకొల్లు
సెల్: 9492484235

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు, కొవ్వూరు, పశ్చిమగోదావరి జిల్లా
S.O.P. No. 6/2024

Between:
1. Sri Gudimetla Ananda Rao and Others ...*Petitioners*
AND
Union Bank of India, Lakkavaram Branch ...*Respondent*

యిందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై నెంబరు S.O.P. 6/2024 పిటిషనర్స్‌కి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు పిటిషనర్స్‌కి దాఖలు పడినవి. సదరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు అభ్యంతరము మేరకు పై పిటిషనర్స్ వారసురాలు అని సక్సెషన్ సర్టిఫికెట్ మంజూరు నిమిత్తం సక్సెషన్ O.P. దాఖలు చేసియున్నారు. పై నెంబరు S.O.P. ది. 30-1-2025న వాయిదా అయి ఉన్నది. యిందు విషయమై ఎవరికైన ఎట్టి ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు వారి ఎదుట **ది. 30-1-2025 సంII తేదీన ఉదయం గంII 10.30 నిIIలకు** స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు మరియు అభ్యంతరములు తెలియపర్చు కొనవలెను. లేని యెడల పరోక్షమున తీర్మానం జరుగును.

PETITION SCHEDULE FILED BY THE PETITIONERS

ITEM NO.1:
Eluru District Previously called as west Godavari District, Jangareddigudem Mandal, Jangareddigudem SRO. In the village of Lakkavaram a land an extent of AC. 3.08 cents of dry land in R.S. No. 490 bounded on:

EAST: The remaining land of petitioners. **SOUTH:** Land of Undavalli Ramarao and Gudimetla Chandra Sekhara Rao. **WEST:** Yerra Kalava. **NORTH:** Land of Uppala Aparna and other.

Within these boundaries an extent of Ac. 3.08 cents of dry land in R.S. No. 490 of Lakkavaram Village within with all easementary rights.

ITEM NO.2:
Eluru District Previously called west Godavari District, Jangareddigudem Mandal, Jangareddigudem SRO. In the village of Lakkavaram a land an extent of 153 Sq. Yards of site and terraced building bearing D. No. 3-82 in assessment No. 418 is bounded on:

EAST: Panchayathi Road. **SOUTH:** House of Patti Veeraswami. **WEST:** House of Kalapala Venkatarao. **NORTH:** House of Vandanapu Balakrishna.

Within these boundaries an extent of 153 Sq. Yards of site and terraced building of Lakkavaram Village within with all easementary rights.

కొండాబత్తుల నరసింహారావు
కొవ్వూరు అడ్వకేట్
11-1-2025 కొవ్వూరు